

**అసెంబ్లీ సమావేశంలో గుంటకండ్ల, కోటిరెడ్డి**

అసెంబ్లీ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సభలో పాల్గొన్న దృశ్యమిది


నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, గురువారం 13 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI




ఆలేరు మండలంలోని శ్రీనివాసాపురంలో బిందెలతో రోడ్లపైకి వచ్చిన మహిళలు

# ఆదర్శం అంతంతే..!

**రైతు భరోసా మినహా అన్నీ తూతూ మంత్రంగానే..**

## పైలెట్ గ్రామాల్లో అమలుకు నోచని పథకాలు

- నెలన్నర దాటినా ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోయలే..
- రేషన్ కార్డు ప్రొసీడింగ్‌లతో చేతులు దులుపుకొన్న వైనం
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కొందరికి మాత్రమే..
- జిల్లా వ్యాప్తంగా 17 పైలెట్ గ్రామాల ఎంపిక

**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పైలెట్ గ్రామాల్లో పథకాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఎంపిక చేసిన గ్రామాల్లో నాలుగు పథకాలను తూతూమంత్రంగా అమలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల హడావుడి, హంగామా తప్ప.. అర్హులకు ఫలాలు అందించడంలో విఫలమయ్యారు. ఒక్క రైతు భరోసా మినహా ఇందిరమ్మ ఇండ్లు, రైతు ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు ప్రొసీడింగ్ పత్రాలకే పరిమితమయ్యాయి. అనేక మందికి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. అర్హులు ఉన్నా రేషన్ కార్డులు పెండింగ్‌లో పెట్టారు.**

– యాదాద్రి భువనగిరి, మార్చి 12 (నమస్తే తెలంగాణ)

ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు జనవరి 26న శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని 17 మండలాల్లో ప్రతి మండలంలో ఓ గ్రామాన్ని ఎంపిక చేసి, సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని ప్రారంభించింది. తొలుత ఎంపిక చేసిన గ్రామంలోనే పథకాలు అమలు చేశారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందించారు. ఆ సమయంలోనే తమకు అన్యాయం జరిగిందంటూ అనేక చోట్ల ప్రజలు నిరసన వ్యక్తం చేశారు.

**రేషన్ కార్డుల పరేషాన్..**

రేషన్ కార్డులకు ఇబ్బందులు తప్పడంలేదు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో 30b శాతం మందికి కూడా ఇవ్వలేదు. పూర్తిగా అర్హులైన వారంటూ పరిమిత సంఖ్యలో జాబితా తయారు చేసి.. ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారు. వీరి రేషన్ కూడా సరిగా ఇవ్వడంలేదు. ఇక మిగతా వారిలో అర్హులు ఉన్నా.. అప్పటికే తల్లిదండ్రుల రేషన్ కార్డులో పేరుండటంతో పెండింగ్ పెట్టారు. ఇప్పుడు వీళ్లే వందల సంఖ్యలో ఉన్నారు. అయితే ముందుగా రేషన్ కార్డు నుంచి పేరు తొలగించుకోవాలని ప్రభుత్వం చెబుతున్నది. ఆ తర్వాత మళ్లీ కొత్త రేషన్ కార్డులో నమోదు చేసుకోవాలంటున్నది. ఈ నేపథ్యంలో ముందుగా కార్డులో పేరు తీసేశాక.. కొత్త రేషన్ కార్డుల్లో మళ్లీ ఎప్పుడు జత చేస్తారో..? లేదోననే ఆందోళన వ్యక్తమవుతున్నది. దీంతో అనేక మంది పాత రేషన్ కార్డుల్లో డిలీట్ చేయించకుండా.. అలాగే ఉంచుతున్నారు. మంతపురిలో 120 మంది కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోగా, తొలుత 22మందికి ప్రొసీడింగ్ కాపీ లు ఇచ్చారు. ఇంకా 51మంది అర్హులు ఉన్నా.. పాత రేషన్ కార్డులో పేరుందని పెండింగ్‌లో పెట్టారు. యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామంలో 91 మంది దరఖాస్తు చేసుకోగా, ఒక్కరికీ రాలేదు.

### ప్రారంభంకాని ఇండ్ల నిర్మాణాలు

ఇందిరమ్మ ఇండ్లు జిల్లా మొత్తం దేవుడెరుగు.. ఎంపిక చేసిన గ్రామాల్లోనూ ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభం కాలేదు. కేవలం ప్రొసీడింగ్ కాపీలు అందించి.. చేతులు దులుపుకొన్నారు. అనేక గ్రామాల్లో ముగ్గు పోయడం ప్రారంభ దశలోనే ఉంది. మంజూరు పత్రాలు ఇచ్చి నెలన్నర కావస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఆలేరు మండలంలోని మంతపురి గ్రామంలో 166 మంది దరఖాస్తు చేసుకోగా, కేవలం 49 మందికి మాత్రమే ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారు. ఒక్కో గ్రామంలో 50 మంది దాటకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తున్నది.

### పంచాయతీలు తెచ్చిపెడుతున్న ఇండ్లు

ఒక్క ఇంట్లో తల్లిదండ్రులతోపాటు పెళ్లైన ముగ్గురు కొడుకులు ఉండి.. ఇల్లు నిర్మించుకోవడానికి స్థలం ఉన్నప్పటికీ ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో చోటు కల్పించలేదు. ఇక అనేక మంది ఇప్పటికే పెంకుటిల్లు, రేకుల ఇండ్లలో ఉంటున్నారు. ముందుగా ఇల్లు కూలగొట్టి నిర్మిస్తేనే తర్వాత డబ్బులు చేయనుంది. ఈ నేపథ్యంలో ఉన్న ఇల్లు కూలగొట్టుకున్నా సర్కారు ఇవ్వకుంటే పరిస్థితి ఏంటనే ఆందోళనలో కొందరు ఉన్నారు. మరోవైపు ఇందిరమ్మ ఇండ్లు కుటుంబాల్లో కుంపటి కూడా పెడుతున్నాయి. ఒక ఇంట్లో ఇద్దరు కొడుకులు ఉంటే.. ఒక కొడుక్కి మంజూరు చేసి, ఇంకో కొడుక్కి ఇప్పుడున్న ఇంటినే లెక్కకట్టారు. ఇందిరమ్మ ఇల్లు కట్టడానికి తన పాలు జాగాను కూలగొట్టి కట్టుకునేందుకు ఇంకో కొడుకు ఒప్పుకోవడంలేదు. ఇలాంటి పంచాయితీలు ఇప్పుడు గ్రామాల్లో పెద్ద మనుషుల దాకా వెళ్లాయంటే అతిశయోక్తి కాదు.

### మూడు కుటుంబాల్లో ఒక్కరికీ ఇల్లు రాలే..



మేం ముగ్గురం అన్నదమ్ములం. అందరికీ పెళ్లి అయ్యింది.తల్లిదండ్రులతో పాటు అందరం ఒకే ఇంట్లో ఉంటున్నాం. ఇంటి నిర్మాణం కోసం జాగా కూడా ఉంది. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఒక్కరికి కూడా మంజూరు కాలేదు. అధికారులను అడిగితే మీ నాన్నకు ఇల్లు ఉంది కదా అంటున్నారు. మేమంతా ఎక్కడ ఉండాలి. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

**- దంతూరి పరశురామ్, మంతపురి, ఆలేరు మండలం**



భువనగిరి మండలంలోని బండసోమారం గ్రామం

### ఆయా గ్రామాల్లో ఇదీ పరిస్థితి..

- గుండాల మండలంలోని బురుజుబావిని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద కేవలం ఒక్క మహిళనే ఎంపిక చేశారు. ఇక్కడ ఇందిరమ్మ ఇండ్ల కోసం 118 అప్లికేషన్ పెట్టుకోగా, 28 మందికి మాత్రమే మంజూరు పత్రాలు ఇచ్చారు.
- రాజాపేట మండలంలోని బూరుగుపల్లిలో రేషన్ కార్డుల కోసం 127 మంది దరఖాస్తు చేసుకోగా, 35 మందిని అర్హులుగా గుర్తించి ఆన్‌లైన్ చేశారు.
- తుర్కపల్లి మండలంలోని కోనాపురంలో ఆత్మీయ భరోసా కింద ఒక్కరికి మాత్రమే ప్రొసీడింగ్ కాపీ ఇచ్చారు.
- బీబీనగర్ మండలంలోని రుద్రవెల్లిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 250మంది దరఖాస్తు చేసుకోగా.. 53మంది అర్హులుగా ఎంపిక చేశారు. అందులో ఒక ఇంటి నిర్మాణానికి మాత్రమే భూమి పూజ చేశారు. ఇందిరమ్మ ఇండ్లలో 401మందికి 115మందికి ప్రొసీడింగ్‌లు ఇచ్చారు. ఇందులో ఒక్కరూ ముగ్గులు పోయలేదు. రేషన్ కార్డులకు ప్రజాపాలనలో 99 దరఖాస్తులు, 63మంది మీసేవా ద్వారా, తుది గ్రామ సభలో 57మందితో కలిసి 219మంది దరఖాస్తు చేసుకోగా 88మందికి ప్రొసీడింగ్‌లు అందజేశారు.
- భువనగిరి మండలంలోని బండసోమారంలో ఇందిరమ్మ ఇండ్లకు 401మంది దరఖాస్తు చేసుకోగా, 115మందికి ప్రొసీడింగ్‌లు ఇచ్చారు. ఇందులో ఒక్కరు కూడా ముగ్గు పోయలేదు.



బండసోమారంలో నీళ్లు రావట్లేదని నల్లా చూపిస్తున్న మహిళ

# తాగునీళ్లూ లేవాయె!

- శ్రీనివాసాపురంలో మంచినీటి సమస్య
- నెల రోజులుగా రాని మిషన్ భగీరథ నీళ్లు
- బిందెలతో ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

యాదగిరిగుట్ట, మార్చి12 : ఎండలు ముదురక ముందే ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్కరోజూ మహిళలు తాగునీటి కోసం రోడ్డెక్కలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 15 నెలల్లోనే గ్రామాల్లో కరువు తాండవిస్తున్నది. ఆలేరు మండలంలోని శ్రీనివాసాపురంలో గత నెలరోజులుగా మంచినీళ్ల రావడం లేదు. ఆలేరు పట్టణానికి కూతవేటు దూరంలో ఈ గ్రామంలో మొత్తం 292 గడపలు ఉన్నాయి. గత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి ఉచితంగా మిషన్ భగీరథ పథకం కింద స్వచ్ఛమైన నీటి సరఫరా కోసం నల్లా కనెక్షన్ ఇచ్చారు. అప్పటి ప్రభుత్వ హయాంలో ఈ గ్రామానికి రోజుకు 40 కేఎల్ నీటిని సరఫరా చేసేది. దీంతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీళ్లు అందాయి. ప్రస్తుతం గ్రామంలో నెల రోజులుగా తాగు నీళ్లందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటికీ నీళ్లు లేవని, స్నానాలు వారానికి రెండు సార్లు మాత్రమే చేస్తున్నామని వాపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఎండ తీవ్రత పెరిగితే తమ పరిస్థితేందని మహిళలు బిందెలతో రోడ్లపైకి వచ్చారు. ఇంత జరుగుతున్నా ఈ గ్రామానికి ఒక్క అధికారి, ప్రజాప్రతినిధి వచ్చి చూసిపోలేదు.

### తాగునీళ్ల కోసం ఎదురుచూస్తున్నాం..



గతంలో ఏనాడూ తాగునీటి కోసం ఎదురు చూడలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక తాగేందుకు నీళ్లు దొరకడంలేదు. నెలరోజులుగా నీళ్లు వస్తలేవని చెప్పినా, ఏ ఒక్క ప్రభుత్వ అధికారిగానీ ఇటువైపు రాలేదు. ఇలానే ఉంటే మండటెండల్లో నీళ్లలేక చావాల్సి వస్తుందోనని భయంగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి పాలన దండుగ.

**-ఉడుగుల లక్ష్మి, శ్రీనివాసాపురం, ఆలేరు మండలం**

### ఓటు ఎందుకేశామని బాధపడుతున్నాం



గత కేసీఆర్ పాలనలోనే మిషన్ భగీరథ నీళ్లు వచ్చేవి. ఇంటింటికీ ఉచితంగా నల్లా ఇచ్చి మంచి నీళ్లిచ్చిండు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఇంకా మంచిగా అవుతదని భావించి ఓటు వేసినం. కానీ ఇప్పుడు బాధపడుతున్నాం. ఇక్కడి ఎమ్మెల్యే కనీసం ఈ గ్రామానికి వచ్చి చూసిన పాపాన పోలేదు. అధికారులు స్పందించి తక్షణమే తాగునీటిని అందించాలి.

**-చౌడెబోయిన అంజమ్మ, శ్రీనివాసాపురం, ఆలేరు మండలం**



వలిగొండలో అరెస్టు అయిన మాజీ సర్పంచులు

# ఎక్కడికక్కడ నిర్బంధం

- మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్
- పెండింగ్ బిల్లులు ఇవ్వాలని అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.1200 కోట్లు పెండింగ్

నల్లగొండ, మార్చి 12 : పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచులు బుధవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. దాంతో వారిని ఉదయం నుంచే ఎక్కడికక్కడ పోలీసులు నిర్బంధించి అరెస్ట్ చేశారు. పోలీస్‌స్టేషన్లకు తీసుకెళ్లారు. దాంతో మాజీ సర్పంచులు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. బిల్లులు విడుదల చేయకుండా, నిరసన తెలుపకుండా అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. ఆయా గ్రామాల్లో గతంలో మాజీ సర్పంచులు సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీల భవనాలు, ఇతర అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.1200కోట్లు ప్రభుత్వం నుంచి వారికి రావాల్సి ఉన్నది. కానీ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 15 నెలలవుతున్నా బిల్లులు విడుదల చేయడం లేదు. ఇప్పటికే పలుమార్లు నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు చేపట్టారు. బుధవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించగా పోలీసులు విఫలం చేశారు.



రాజాపేట : పారుపల్లిలో ఎండిపోయిన పంటను చూపిస్తున్న రైతు యాదయ్య

# పొట్టకొచ్చిన పంట పశువుల పాలు

**నీళ్లు లేక ఎండిన ఎనిమిదెకరాల వరి పొలం**

రాజాపేట, మార్చి 12 : రాజాపేట మండలంలోని పారుపల్లికి చెందిన రైతు గౌర యాదయ్య నీళ్లు లేక ఎండిన పొలాన్ని పశువుల మేతకు వదిలేశాడు. గత పదేండ్లుగా గుంట కూడా ఎండలేదని, యాసంగి కారుకు గవర్నమెంట్ నుంచి పెట్టుబడి పైసలు రాక షావుకారి వద్ద రెండు లక్షలు అప్పు తీసుకొచ్చానని తెలిపాడు. మూడు బోర్ల కింద 8 ఎకరాలు వరి నాటేశానని, తన పొలం పక్కనే ఎండాకాలం కూడా పారే వాగు ఎండిపోయి మూడు బోర్లు వట్టిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. పొట్ట దశ కొచ్చిన పంట అంతా ఎండిపోవడంతో పశువులను మేపుతునాన్నని ఆవేదన వ్యక్తం చేశాడు.

పశువులు మేస్తున్న పంటను చూసి అటుగా వెళ్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యాడు.



బుద్ధవనంలో విదేశీ మీడియా ప్రతినిధుల బృందం

# బుద్ధవనాన్ని సందర్శించిన విదేశీయులు

నందికొండ, మార్చి 12 : నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని బుద్ధవనాన్ని నేపాల్, శ్రీలంక, గయానా, టాంజానియా, సూరినేమ్ దేశాలకు చెందిన 28 మంది విదేశీ మీడియా ప్రతినిధులు బుధవారం సందర్శించారు. బుద్ధవనంలోని జాతకపార్కు, ధ్యానమందిరం, అవకానబుద్ధ, మహాస్తూపాన్ని వారు పరిశీలించారు.

వీరి వెంట గైడ్ సత్యనారాయణ, ఎస్‌ఐ సంపత్ గౌడ్, ప్రొటోకాల్ ఆర్‌ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

# చివరికి మేతగా..

**సాగర్ చివరి ఆయకట్టుకు అందని సాగు నీరు**

- మాడ్గులపల్లి మండలంలో ఎండుతున్న వరి పొలాలు
- ఇప్పటికే ఎండుముఖం పట్టిన 230 ఎకరాలు
- ఎండిన పంటలు పశువుల మేతకు వదిలేస్తున్న దుస్థితి

**రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరి పంటలు నీళ్లు అందకపోవడంతో ఎండిపోతున్నాయి. మాడ్గులపల్లి మండలంలో సాగర్ ఆయకట్టు చివరి భూములు కావడంతో నీళ్లు పూర్తి స్థాయిలో రావడం లేదు. దాంతో పంటలు ఎండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండిన పంటలను పశువుల మేతకు వదిలేస్తున్న దుస్థితి నెలకొంది.**

– మాడ్గులపల్లి, మార్చి 12



మాడ్గులపల్లి మండలం గణపతివారిగూడెంలో నీళ్లు అందక ఎండిపోయిన వరి పొలాల్లో మేత మేస్తున్న జీవాలు

**డి-40 కాల్వకు నీళ్లు రాకపోవడం తోనే..**

మాడ్గులపల్లి మండలంలోని సీత్యాతండా, గణపతివారి గూడెం, దేవతలబావిగూడెం, పుచ్చకాయలగూడెం, గొల్ల గూడెం, గౌడగూడెం గ్రామాలకు డీ-40 కాల్వ ద్వారా సాగు నీరు అందుతుంది. కాల్వ కింద సుమారు 400 ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం డి-40 కాల్వ ద్వారా నీటిని అందించకపోవడంతో ఆయా గ్రామాల్లో 230 ఎకరాల వరిపంట ఎండిపోయే పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం చివరి భూములకు సైతం నీరు అందిస్తామని హామీ ఇచ్చి ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడతో వరి పొలాలు నెర్రెలువారుతున్నాయి. వేసవికాలంలో భూగర్భజలాలు సైతం అడుగంటడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అప్పులు తీసుకొచ్చి సాగు చేసిన పంటలకు కనీసం పెట్టుబడి కూడా రాలేని దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొట్టదదశలో ఉన్న పొలాలు ఎండిపోవడంతో జీవాలు మేత మేస్తున్నాయని, ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి డి-40కాల్వకు నీటిని వదిలితే తమ పొలాలు ఎండిపోయేవి కాదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే డి-40కాల్వ ద్వారా నీటిని అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### అప్పులే మిగిలాయి

నేను ఐదు ఎకరాలు వరి సాగు చేసిన. పంట పొట్ట దశకు వచ్చే సరికి డి-40 కాల్వ ద్వారా నీళ్లు రావడం లేదు. ఐదెకరాల్లో మూడెకరాలు ఎండిపోయింది. ఎండాకాలం కావడంతో మిగతా రెండు ఎకరాలు కూడా ఎండిపోయే పరిస్థితి ఉంది. ఎండిపోయిన మూడెకరాల్లో చేసేదేమీ లేక జీవాలను మేపుతున్నాం. ఎకరానికి 30వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన. పెట్టిన ఖర్చు కూడా రాని పరిస్థితి ఉంది. అప్పుల పాలవ్వడమే తప్ప ఏం లేదు. ప్రభుత్వం రైతుభరోసా ఇంతవరకు ఇవ్వలేదు. ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

**-రాచకొండ వెంకన్న, రైతు, గుర్రప్పగూడెం, మాడ్గులపల్లి**



ఎండిపోయిన పొలాలలో జీవాలను మేపుతున్న రైతు వెంకన్న

### రెండెకరాల పంట ఎండిపోయింది



మా సీత్యాతండా గ్రామంలో నేను మూడెకరాలు సాగు చేస్తున్నాయి. నాట్లు పెట్టినప్పుడు నీళ్లు బాగానే వచ్చినయి. కాని తీరా పంట పొట్ట దశకు వచ్చి 16రోజులవుతున్నా డి-40 కాల్వ ద్వారా నీళ్లు బంద్ అయినయి. ఉన్న బోరే దిక్కయింది. ఎండాకాలం కావడంతో బోరులో కూడా నీళ్లు అడుగంటి కేవలం ఒక ఎకరమే పారుతుంది. మిగతా రెండు ఎకరాలు ఎండిపోవడంతో జీవాలు మేస్తున్నాయి. మూడెకరాలకు 60వేల రూపాయల దాక ఖర్చు చేసిన. సాగుకు పెట్టిన ఖర్చు కూడా వెళ్లే పరిస్థితి లేదు. అప్పుల పాలవ్వడమే తప్ప ఏం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా మొర ఆలకించి కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలి.

**-శ్రీనునాయక్ , రైతు, సీత్యాతండా, మాడ్గులపల్లి**

### రైతుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నది



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూస్తుంది. కనీసం నీళ్లు విడిచిపెట్టకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి. మా ఊర్లో నేను ఐదు ఎకరాలు సాగు చేస్తున్నా. డి-40 కాల్వ ద్వారా నీరు రాకపోవడంతో పొలాలకు నీరు అందడం లేదు. ఉన్న రెండు బోర్లలో ఒక్కటే బోరు పోస్తుంది. అది కూడా రెండెకరాలకు మాత్రమే పారుతుంది. మిగతా మూడు ఎకరాలు ఎండిపోవడంతో జీవాల మేతకు వదిలేసిన. కాల్వ నీళ్లు వస్తే ఈ సమస్య ఉండేది కాదు.

**- లచ్చుము. రైతు, సీత్యాతండా, మాడ్గులపల్లి**